


ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 217 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦https:www.prajarepublic.com ✦ వెల - 1/- | గురువారం 13 మార్చి 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# విద్యుత్ రంగంలో తొలి సంస్కరణలు తీసుకొచ్చింది తెదేపానే: చంద్రబాబు

**విద్యుత్ రంగంలో తొలి సంస్కరణలు తీసుకొచ్చింది తెదేపా ప్రభుత్వమేనని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.**

**అమరావతి, మార్చి 13, (రిపబ్లిక్ న్యూస్):** విద్యుత్ రంగంలో తొలి సంస్కరణలు తీసుకొచ్చింది తెదేపా ప్రభుత్వమేనని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. శాసనసభలో ఇంధన శాఖపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. "1988లో విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చాం. డిస్ట్రిబ్యూషన్, జనరేషన్, ట్రాన్స్ మిషన్గా విభజించాం. ఎనర్జీ ఆడిటింగ్ తీసుకొచ్చాం. కరెంట్ కొరత లేని ఏకైక రాష్ట్రంగా ఏపీని తయారు చేశాం. ఆనాడు తీసుకొచ్చిన సంస్కరణల ఫలితాలను చూసి సంతోషించాం. వ్యవసాయానికి యూనిట్కు వసూలు చేసే పరిస్థితి నుంచి శ్లాబ్ రేటుతో రైతులను ఆదుకుంది తెదేపా ప్రభుత్వమే.



2014లో రాష్ట్రంలో 22.5 మిలియన్ యూనిట్ల కరెంట్ కొరత ఉండేది. కేంద్ర ప్రభుత్వం సహకారంతో దాన్ని సవాల్ తీసుకున్నాను. 2014 డిసెంబర్కు ఎక్కడా కరెంట్ కొరత లేకుండా చేసి.. జనవరి 2018 నాటికి మిగులు విద్యుత్ సాధించిన రాష్ట్రంగా మార్చాను. ఇప్పుడు గర్వంగా చెబుతున్నా.. 9 గంటలు వ్యవసాయానికి కరెంట్ ఇస్తున్నాం. నేను 1995 లో మొదటిసారి సీఎం అయ్యేసరికి 10 నుంచి 15 గంటల పాటు కరెంట్ కోతలుండేవి. పరిపాలన ఎలా ఉండాలో ఆలోచించా.. అందుకు అనుగుణంగా ప్రణాళికలతో ముందుకెళ్లా. మీటర్ రీడింగ్ కోసం స్పాట్ బిల్లింగ్ తీసుకొచ్చాం. ప్రపంచం మొత్తం అధ్యయనం చేశా.. ప్రపంచ బ్యాంకు జీతగాడు అని నాపై విమర్శలు చేశారు" అని చంద్రబాబు అన్నారు.

## అంతర్జాతీయ అంశంగా పీపీఏల రద్దు

విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఉన్న ఏపీని.. వైకాపా ప్రభుత్వం లోటు పరిస్థితికి తీసుకెళ్లిందని చంద్రబాబు మండిపడ్డారు. పరిశ్రమలు కరెంట్ వాడితే సర్చార్జీ విధించిన ఘనత ఆ ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో తలసరి విద్యుత్ వినియోగం 23 శాతం మేర పెరిగిందని సీఎం చెప్పారు. సౌర, పవన విద్యుత్ను 7700 మెగావాట్లు మేర ఉత్పత్తి చేసిన మొదటి రాష్ట్రం ఏపీ అని చెప్పారు. 2019-24 మధ్య అసమర్థ పాలనతో రాష్ట్రంలో మళ్లీ చీకటి రోజులు వచ్చాయన్నారు. ఆలోచన లేకుండా వైకాపా ప్రభుత్వం పీపీఏలను రద్దు చేసేసిందని.. ఆ విషయం అంతర్జాతీయ అంశంగా మారిపోయిందని గుర్తుచేశారు. దావోస్లో లోనూ దీనిపై చర్చ జరిగిందన్నారు. ఒక వ్యక్తి ఈగో కారణంగా రాష్ట్ర ఖజానా నుంచి రూ.9 వేల కోట్లు పీపీఏలకు చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# నిజంగా అంత బాధ ఉంటే..

## నిర్మలమ్మ వ్యాఖ్యలకు విజయ్ కౌంటర్

**కేంద్రం, తమిళనాడు మధ్య భాషాయుద్ధం నడుస్తోన్న తరుణంలో కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ చేసిన వ్యాఖ్యలను టీవీకే చీఫ్ విజయ్ ఖండించారు.**

**చెన్నై, మార్చి 13, (రిపబ్లిక్ న్యూస్):** ప్రముఖ సంఘసంస్కర్త పెరియార్ పై కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ చేసిన విమర్శలను తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, ప్రముఖ నటుడు విజయ్ తీవ్రంగా ఖండించారు. ఏళ్లు గడిచినా ఆయన పేరు వాడకుండా ఉండలేని విధంగా ప్రజల మనసుల్లో నిలిచిపోయారని కౌంటర్ ఇచ్చారు. తమిళాన్ని అవమానించిన వ్యక్తికి పూలమాలలు వేస్తున్నారంటూ ఈవీకే పెరియార్ను పరోక్షంగా ప్రస్తావిస్తూ రాజ్యసభలో సీతారామన్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆమె వ్యాఖ్యలపై స్పందించిన విజయ్.. సమాజంలో సాంఘిక దురాచారాలు పారదోలడానికి పెరియార్ చేసిన కృషిని కొనియాడారు. "బాల్య వివాహాలను వ్యతిరేకించారు.



వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారు. కులం పేరిట జరిగిన అకృత్యాలను ఖండించారు. ఇలా మనం ఆయన గురించి చెప్తూపోవచ్చు. సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లు ఉండాలని మనం ఇప్పుడు మాట్లాడుతున్న మాటలను ఆయన వందసంవత్సరాల క్రితమే పిలుపునిచ్చి ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు. పెరియార్ తమిళ భాషను అవమానించినందుకు కేంద్రమంత్రి నిజంగానే బాధపడ్డారా..? మీరు నిజంగా బాధపడి ఉంటే.. త్రిభాషా సూత్రాన్ని మాపై రుద్దడం ఆపేస్తారా..? పెరియార్ గురించి ఎవరైనా అవమానకర వ్యాఖ్యలు చేస్తే.. అవి వివాదాస్పదం అవుతుంటాయి. తమిళనాడు ప్రజల మనసులో ఆయన ఎలా నిలిచి ఉన్నారో, ఆయన్ను ఎలా గౌరవిస్తున్నారో ఈ ఒక్క ఉదాహరణ చాలు" అని విజయ్ అన్నారు. జాతీయ విద్యా విధానంలోని (ఎన్ఈపీ-2020) త్రిభాషా సూత్రంపై రాజకీయ దుమారం రేగుతోంది. కొత్త విధానంలో భాగంగా మూడు భాషలను విద్యార్థులు నేర్చుకోవాల్సిందేనని, అందులో రెండు భారతీయ భాషలుండాలని కేంద్ర ప్రభుత్వం అంటుండగా.. హిందీని అందరిపై రుద్దడానికే కేంద్రం దీనిని తెరపైకి తెచ్చిందని కొన్ని రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఈ విషయంలో తమిళనాడు అగ్గిమీద గుగ్గిలమవుతోంది. ఈ నేపథ్యంలో త్రిభాషా సూత్రంపై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తిప్పికొట్టారు. విద్యార్థులు చదువుకునే హక్కును హరించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. విద్యా విధానాల అమలు విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఎస్ఈపీ-2020లోని కీలక అంశాలను, ముఖ్యంగా త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి నిరాకరించిన కారణంగా కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కింద అందించాల్సిన రూ.573 కోట్లను నిలిపేసింది. ఎన్డీపీ మార్గదర్శకాలు అమలు పరిస్తేనే కేంద్రం తన వాటా నిధులు అందిస్తుందని విధాన నిబంధనలు చెబుతున్నాయి. ఇలా కేంద్రం, తమిళనాడు మధ్య వివాదం నడుస్తోన్న వేళ.. నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలు విమర్శలు దారితీశాయి.

# ఎవరి ట్రాప్లోనూ పడను: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

**గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధముందని.. ఫొటోలు దిగి చూపించుకోవాల్సిన అవసరం లేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.**



**దిల్లీ, మార్చి 13, (రిపబ్లిక్ న్యూస్):** గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధముందని.. ఫొటోలు దిగి చూపించుకోవాల్సిన అవసరం లేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తానెవరో తెలియకుండానే పీసీసీ అధ్యక్షుడు, సీఎం పదవులకు ఎంపిక చేస్తారా? అని ప్రశ్నించారు. ఎవరి ట్రాప్లోనూ తాను పడనన్నారు. విదేశాంగ మంత్రి జైశంకర్ను కలిసేందుకు దిల్లీ చేరుకున్న సందర్భంగా సీఎం మీడియాతో నిర్వహించిన చిట్చాట్లో మాట్లాడారు.

ప్రతిపక్ష నేత కేసీఆర్ గవర్నర్ ప్రసంగానికి రావడం కాదని.. అసెంబ్లీలో చర్చకు హాజరుకావాలన్నారు. డీలిమిటేషన్.. లిమిటేషన్ ఫర్ సౌత్ అని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి రావాల్సిన వాటిపై కేంద్రమంత్రి కిషన్రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. ఆయా అంశాలు సాధించుకురావాలనే ఆయన్ను ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు.

## 'భారత్ సమ్మిట్'కు క్లియరెన్స్ కోసమే జైశంకర్ను కలుస్తున్నా..

తెలంగాణలో 'భారత్ సమ్మిట్' పేరిట ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీఎం తెలిపారు. సుమారు 60 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ సమ్మిట్కు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తదితరులు హాజరయ్యే అవకాశముందని చెప్పారు. భారత్ సమ్మిట్కు కేంద్ర ప్రభుత్వం క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుందని.. ఆ విషయంపైనే విదేశాంగ మంత్రి జైశంకర్ను కలుస్తున్నట్లు సీఎం తెలిపారు. రాష్ట్రంలో 'మిస్ వరల్డ్' పోటీలు జరగనున్నాయని.. నెలరోజుల పాటు దీనికి సంబంధించిన కార్యక్రమాలు ఉంటాయన్నారు. దీనికోసం రెండు రోజుల్లో అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# రన్యా రావు స్మగ్లింగ్ కేసు.. ఈడీ దాడులు!

**కన్నడ నటి రన్యా రావు బంగారం అక్రమ రవాణా వ్యవహారానికి సంబంధించి బెంగళూరు సహా వ్యాప్తంగా అనేక చోట్ల ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ దాడులు చేపట్టింది.**

**బెంగళూరు, మార్చి 13, (రిపబ్లిక్ న్యూస్):** కన్నడ నటి రన్యా రావు బంగారం అక్రమ రవాణా వ్యవహారానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా బెంగళూరు సహా వ్యాప్తంగా అనేక చోట్ల దాడులు చేపట్టింది. కేవలం రాజధానిలోనే ఎనిమిది చోట్ల సోదాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ రాకెట్లో భారీ కుట్ర దాగి ఉన్నట్లు అనుమానిస్తున్న ఈడీ ఆ దిశగా దర్యాప్తు చేస్తోంది. ఈ వ్యవహారంలో సీబీఐ కూడా ఇప్పటికే దర్యాప్తు ముమ్మరం చేసిన విషయం తెలిసిందే.

దుబాయ్, మలేసియాలకు హవాలా మార్గంలో నగదు తరలిస్తున్నట్లు గుర్తించడంతో ఇందులో అంతర్జాతీయ రాకెట్ హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. రన్యాతోపాటు మరి కొంత మంది పాత్ర ఉండవచ్చని దర్యాప్తు సంస్థలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఎయిర్పోర్టుల ద్వారా సాగిస్తున్న ఈ స్మగ్లింగ్లో రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, ప్రముఖుల పాత్రపైనా దృష్టి సారించాయి. వీటికి సంబంధించిన సాక్ష్యాలను వెలికితీసేందుకు సీబీఐ, డీఆర్ఐలతో సమన్వయం చేసుకుంటున్న ఈడీ .. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఇటీవల కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా బెంగళూరు సహా ఇతర ప్రాంతాల్లో సోదాలు కొనసాగిస్తోంది.



## ఎటువంటి ఒత్తిడి లేదు హోంమంత్రి


ఈ కేసులో సీఐడీ దర్యాప్తును ఉపసంహరించుకోవడంలో తనపై ఎటువంటి ఒత్తిడి లేదని కర్ణాటక హోంమంత్రి జీ పరమేశ్వర పేర్కొన్నారు. రన్యా తండ్రి రామచంద్రరావు ఐపీఎస్ అధికారి అయినందువల్ల ఈ కేసును సిబ్బంది, పాలనా సంస్కరణల విభాగం (డీపీఏఆర్)తో దర్యాప్తు చేయించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. ఒకేసారి రెండు దర్యాప్తులు అవసరం లేనందున ఇందులో నుంచి సీఐడీని తప్పించామన్నారు. రన్యా పెళ్లికి సీఎం కూడా హాజరైన విషయాన్ని మీడియా ప్రశ్నించగా.. ఆయన వేల వివాహాలకు హాజరయ్యారంటూ హోంమంత్రి ఆగ్రహంగా సమాధానమివ్వడం గమనార్హం.



# 2 లక్షల మందికి నైపుణ్య శిక్షణ..

## మైక్రోసాఫ్ట్తో ఏపీ ప్రభుత్వం ఎంవోయూ

**యువతలో ఏఐ నైపుణ్యాలు పెంచేందుకు టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది.**



**అమరావతి, మార్చి 13, (రిపబ్లిక్ న్యూస్):** యువతలో ఏఐ నైపుణ్యాలు పెంచేందుకు టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఏఐ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏడాది వ్యవధిలో 2 లక్షల మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో మైక్రోసాఫ్ట్, ఏపీఎస్ఎస్ఈ ఎంవోయూ చేసుకున్నాయి. ఐటీ, ఇతర పరిశ్రమలకు అవసరమైన సిబ్బందిని తయారు చేయడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. దాదాపు 2 లక్షల మంది రాష్ట్ర యువతకు అంతర్జాతీయంగా ఉద్యోగాలు వచ్చే విధంగా మైక్రోసాఫ్ట్ శిక్షణ ఇవ్వనుంది. 50 గ్రామీణ ఇంజినీరింగ్ కాలేజీల్లో 500 మంది అధ్యాపకులకు శిక్షణ ఇవ్వనుంది. 10వేల మంది విద్యార్థులకు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, 30 ఐటీఐల్లోని 30 వేల మంది విద్యార్థులకు డిజిటల్ ప్రొడక్టివిటీలో ఏఐ శిక్షణ ఇవ్వనుంచి.

## వర్సిటీల్లో తప్పు చేయాలంటేనే భయపడేలా ప్రభుత్వం చర్యలు:మంత్రి లోకేశ్

**ఏపీలోని వర్సిటీల్లో తప్పు చేయాలంటేనే భయపడేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉంటాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అక్రమాలపై అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో చర్చ జరిగింది.**

**అమరావతి, మార్చి 13, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీలోని వర్సిటీల్లో తప్పు చేయాలంటేనే భయపడేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉంటాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అక్రమాలపై అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో చర్చ జరిగింది. వైకాపా ప్రభుత్వ హయాంలో అనేక అక్రమాలు జరిగాయని తెదేపా, భాజపా, జనసేన ఎమ్మెల్యేలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై తెదేపా ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడారు. అనంతరం మంత్రి లోకేశ్ వారికి సమాధానమిచ్చారు. ఏయూలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. ఇన్ఛార్జ్ వీసీ ఇప్పటికే విచారణకు ఆదేశించారన్నారు. ఆ విచారణ నివేదిక రాగానే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే వెలగపూడి



రామకృష్ణబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు అవుతున్నా ఇంకా ఉపేక్షించడం తగదన్నారు. నిర్దిష్ట కాలపరిమితితో విచారణను వేగవంతం చేయాలని ఆయన కోరారు. మరో ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ.. గతంలో వీసీగా పనిచేసిన ప్రసాదరెడ్డి వైకాపా అధ్యక్షుడి తరహాలో వ్యవహరించారని ఆరోపించారు. ఎంతో పేరున్న ఏయూను రాజకీయ వేదికలా ఆయన మార్చారని ఆక్షేపించారు. ఇతర వర్సిటీల ప్రక్షాళన కూడా జరగాలని జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు.

# ఏకపక్షంగా సస్పెండ్ చేశారు..

## తగిన మూల్యం చెల్లించుకుంటారు:కేటీఆర్

**జగదీశ్ రెడ్డిని ఉద్దేశపూర్వకంగా సభ నుంచి సస్పెండ్ చేశారని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.**



**హైదరాబాద్, మార్చి 13, (రిపబ్లిక్ న్యూస్):** జగదీశ్ రెడ్డిని ఉద్దేశపూర్వకంగా సభ నుంచి సస్పెండ్ చేశారని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. జగదీశ్రెడ్డి సస్పెన్షన్ తర్వాత భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..."స్పీకర్ పట్ల జగదీశ్రెడ్డి అగౌరవంగా మాట్లాడలేదు.

అనని మాటను అన్నట్టుగా చిత్రీకరించారు. నిబంధనలకు విరుద్ధంగా సభలో ఏమీ మాట్లాడకపోయినా.. ఈ సమావేశాలు పూర్తయ్యే వరకు ఆయన్ను సస్పెండ్ చేయడం దారుణం. స్పీకర్ పట్ల ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, తాను చేసిన తప్పేంటని వివరణ అడిగే అవకాశం కూడా జగదీశ్ రెడ్డికి ఇవ్వలేదు. స్పీకర్ బాధపడి ఉంటే విచారం వ్యక్తం చేయాలని, సభ సజావుగా జరిగేందుకు సహకరించాలని కేసీఆర్ ఆదేశించారు. ఇదే విషయాన్ని స్పీకర్, మంత్రి శ్రీధరబాబుకు స్పష్టంగా చెప్పాం. అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని కోరాం. అయినా, పట్టించుకోకుండా నియంతృత్వ పోకడలతో సభను 5 గంటలపాటు వాయిదా వేశారు. ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు మంత్రులతో మాట్లాడించి.. జగదీశ్రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకుంటారు" అని కేటీఆర్ అన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# ఓటీటీలోకి 'బ్రహ్మ ఆనందం'.. స్ట్రీమింగ్ ఎప్పటినుంచి అంటే?

'బ్రహ్మ ఆనందం' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది.



బ్రహ్మానందం.. ఆయన కుమారుడు రాజా గౌతమ్ తాత- మనవళ్లుగా నటించిన చిత్రం 'బ్రహ్మ ఆనందం'. ఆర్వీఎస్ నిఖిల్ దర్శకత్వం వహించారు. కుటుంబ కథాచిత్రంగా రూపొందిన ఈ సినిమా గతనెల 14న థియేటర్లలో విడుదలైంది. బ్రహ్మానందం యాక్టింగ్, కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీలోకి రానుంది. ఆహా వేదికగా ఇది మార్చి 14 నుంచి స్ట్రీమింగ్ కానుందని టీమ్ వెల్లడించింది. కథేంటంటే: బ్రహ్మ అలియాస్ బ్రహ్మానందం (రాజా గౌతమ్) ఓ థియేటర్ ఆర్టిస్ట్. ఎప్పటికైనా పెద్ద నటుడు కావాలన్నది తన లక్ష్యం. ఢిల్లీలో జరగనున్న కళారంగ్ మహోత్సవంలో నాటకం వేసే అవకాశాన్ని అందిపుచ్చుకుంటాడు. ఇందులో పాల్గొనాలంటే రూ.6 లక్షలు ఇవ్వాలని ఆ వేడుక నిర్వాహకుడు బ్రహ్మను డిమాండ్ చేస్తాడు. అదే సమయంలో వృద్ధాశ్రమంలో ఉండే తన తాత మూర్తి అలియాస్ ఆనంద రామ్మూర్తి (బ్రహ్మానందం) తన పేరు మీద కోదాడ దగ్గర ఆరెకరాల భూమి ఉందని.. తాను చెప్పినట్లు చేస్తే అది ఇస్తానని చెప్పి బ్రహ్మను ఊరుకి తీసుకెళ్తాడు. మరి అక్కడికి వెళ్లాక ఏం జరిగింది? తాను చెప్పినట్లుగా బ్రహ్మకు మూర్తి పొలం రాసిచ్చాడా? దీన్ని ఇవ్వడం కోసం అతను పెట్టిన షరతులేంటి? అసలు మూర్తి వృద్ధాశ్రమంలోనే ఉండిపోవడానికి కారణమేంటి? వంటి ఆసక్తికర అంశాలతో ఈ సినిమా సిద్ధమైంది.

# 'కోర్ట్' హిట్.. తన సినిమా సేఫ్ అంటూ 'హిట్ 3' దర్శకుడు ఆసక్తికర పోస్ట్

'కోర్ట్' హిట్ కావడంతో తన 'హిట్ 3' సినిమాపై పోస్ట్ పెట్టారు శైలేశ్ కొలను. ప్రస్తుతం ఆ పోస్ట్ వైరల్‌గా మారింది.



తాను నిర్మాతగా వ్యవహరించిన 'కోర్ట్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్లో నాని చేసిన వ్యాఖ్యలు వైరల్ అయిన విషయం తెలిసిందే. 'కోర్ట్' నచ్చకపోతే తన అప్ కమింగ్ మూవీ 'హిట్ 3' చూడొద్దని బహిరంగంగా చెప్పారు. తాజాగా ఈ వ్యాఖ్యలను ఉద్దేశించి 'హిట్ 3' దర్శకుడు ఆసక్తికర పోస్ట్ పెట్టారు. ప్రియదర్శి ప్రధాన పాత్రలో రామగదీశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కోర్ట్'. మార్చి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా దీని పెయిడ్ ప్రీమియర్స్ ప్రదర్శించగా ఇది మంచి ప్రేక్షకాదరణతో హిట్ టాక్ సొంతం చేసుకుంది. దీంతో తన సినిమా సేఫ్ అంటూ శైలేశ్ కొలను పోస్ట్ పెట్టారు. "నా సినిమా సేఫ్ (హిట్ 3). 'కోర్ట్' సినిమాలో ఎన్నో భావోద్వేగాలు ఉన్నాయి. ఇది కచ్చితంగా అందరికీ నచ్చుతుంది. అందరూ చూడాల్సిన చిత్రమిది. మూవీ యూనిట్కు నా అభినందనలు. ప్రియదర్శి.. నువ్వు మరో విజయం సాధించావు. ఇక నా 'హిట్ 3' ఎడిట్ రూమ్కు వెళ్లాలి. అందరూ కోర్ట్ సినిమా చూడండి" అని పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్కు 'మిర్చి'లో ప్రభాస్ పోస్టర్ను జోడించారు. మిర్చిలో ప్రభాస్ 'నా ఫ్యామిలీ సేఫ్' అని డైలాగు చెప్పే ఇమేజ్లను శైలేశ్ కొలను పంచుకున్నారు. అంటే 'కోర్ట్'కు హిట్ టాక్ వచ్చింది కాబట్టి 'హిట్ 3' సినిమా సేఫ్ అని తన పోస్ట్లో వివరించారు. 'హిట్ 3' విషయానికొస్తే.. 'హిట్' యూనివర్స్లో భాగంగా రూపొందుతోన్న సరికొత్త చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. నాని కథానాయకుడిగా శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈ సినిమా సిద్ధమవుతోంది. ఇందులో నాని పవర్ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో అర్జున్ సర్కార్గా కనిపించనున్నారు. మే 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల దీని టీజర్ ను విడుదల చేయగా దానికి భారీ స్పందన వచ్చింది. 24 గంటల్లోనే 16 మిలియన్లకు పైగా వ్యూస్ సొంతం చేసుకుంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

# ఓటీటీలోకి 'ఆజాద్'..

## స్ట్రీమింగ్కు సిద్ధమైన రవీనా టాండన్ కుమార్తె చిత్రం

రవీనా టాండన్ కుమార్తె రషా థడానీ ప్రధాన పాత్రలో నటించిన 'ఆజాద్ చిత్రం ఓటీటీ స్ట్రీమింగు సిద్ధమైంది.



బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అజయ్ దేవణ్ మేనల్లుడు అమన్ దేవణ్, రవీనా టాండన్ కుమార్తె రషా థడానీ ప్రధాన పాత్రల్లో నటించిన తొలి చిత్రం 'ఆజాద్'. హిస్టారికల్ రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి అభిషేక్ కపూర్ దర్శకత్వం వహించారు. జనవరి 17న ఈ సినిమా విడుదలైంది. రషా థడానీ, అమన్ దేవణ్ యాక్టింగ్ సినీ విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ బాక్సాఫీస్ వద్ద మాత్రం ఈ సినిమా ఆశించిన ఫలితాలు అందుకోలేకపోయింది. తాజాగా ఈ సినిమా ఓటీటీ రిలీజ్కు రంగం సిద్ధమైంది. నెటిక్స్ వేదికగా శుక్రవారం (మార్చి 14) నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సదరు ఓటీటీ సంస్థ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది. బ్రిటిష్ కాలం నాటి పాలనలో సాగే ఓ పీరియాడిక్ డ్రామాగా 'ఆజాద్' రూపొందింది. చరిత్రాత్మకమైన హల్దీఘాట్ యుద్ధం ఆధారంగా దీన్ని తెరకెక్కించారు. ఓ తిరుగుబాటు నాయకుడి గుర్రంపై ఆప్యాయత పెంచుకున్న యువకుడు గోవిందా (అమన్ దేవగణ్).. ఆ నాయకుడి మరణం తర్వాత దాని సంరక్షణ బాధ్యత తీసుకుంటాడు. ఈ క్రమంలోనే అతడు జానకి (రషా థడానీ) తో ప్రేమలో పడతాడు. మరి, తమ ప్రేమను కాపాడుకోవడానికి అతడు ఏం చేశాడు? గోవిందా ఆ గుర్రంపై అంతటి ఆప్యాయత పెంచుకోవడానికి కారణం ఏమిటి? అన్న ఆసక్తికర అంశాలతో ఈ సినిమా సిద్ధమైంది. రోనీ స్క్రూవాలా దీనిని నిర్మించారు.


## చాహల్ డేటింగ్ వార్తలు.. మహ్వాశ్ వైరల్ పోస్ట్



టీమ్ ఇండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, సోషల్మీడియా ఇన్ఫ్లుయెన్సర్, రేడియో జాకీ మహ్వాశ్ డేటింగ్లో ఉన్నారంటూ గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలోనే మహేశ్ తాజాగా ఇన్స్టా స్టోరీస్ వేదికగా ఒక ఆసక్తికర పోస్ట్ పెట్టారు. ఇటీవల ఓ కార్యక్రమంలో తనకు బెస్ట్ మెగా ఇన్ఫ్లుయెన్సర్ అవార్డు రావడంపై ఆమె స్పందించారు. "నేను ఈ స్థాయికి రావడం చూసి చిన్ననాటి మహవశ్ ఎంతో గర్వపడుతుంది. ఇది ఎంతో ప్రత్యేకమైన విషయం. ఏ తప్పు లేకుండా... ఎలాంటి అసత్యాల గురించి పట్టించుకోకుండా మన పని మనం చేస్తూ ముందుకుసాగిపోవాలి" అని ఆమె రాసుకొచ్చారు. డేటింగ్ వార్తల వేళ ఆమె పెట్టిన ఈ పోస్ట్ ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయా కథనాలను ఉద్దేశించే ఆమె ఈవిధంగా పెట్టిందని పలువురు భావిస్తున్నారు. చాహల్ తన భార్య ధనశ్రీతో విడాకులు తీసుకుంటున్నట్లు కొంతకాలంగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. దుబాయ్ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ను మహవశ్, చాహల్ కలిసి వీక్షించారు. మ్యాచ్కు ముందు ఓ సెల్ఫీ వీడియో, ఫొటోలను ఆమె తన ఇన్స్టా ఖాతాలో పోస్ట్ చేశారు. వీరిద్దరూ కలిసి కన్పించడం ఇదే తొలిసారి కాదు. గతేడాది డిసెంబరులోనూ చాహల్ తో కలిసి దిగిన ఓ ఫొటోను ఆమె షేర్ చేశారు. అప్పట్లోనే వీరిద్దరూ డేటింగ్లో ఉన్నట్లు వార్తలు రాగా.. మహ వ్శ్ వాటిని తోసిపుచ్చింది. అవన్నీ నిరాధారమని, తప్పుడు కథనాలు సృష్టించొద్దని కోరింది. మరోవైపు, ఈ డేటింగ్ మరోసారి తెరపైకి రావడంతో మహవశ్ సోషల్మీడియా ఫాలోవర్స్ సంఖ్య పెరిగింది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1733: ఆక్సిజన్‌ను కనుగొన్న జోసెఫ్ ప్రీస్ట్లీ జననం.
- 1854: నాటక రచయిత, న్యాయవాది కోలాచలం శ్రీనివాసరావు జననం. (మ.1919)
- 1899: హైదరాబాదు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు జననం. (చిత్రంలో)
- 1911: అభ్యుదయ రచయిత, నాటక విమర్శకుడు శ్రీనివాస చక్రవర్తి జననం. (మ.1976)
- 1937: సాహితీ విమర్శకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వల్లంపాటి వెంకటసుబ్బయ్య జననం.
- 1940: జలియన్ వాలా బాగ్ దురంతానికి కారకుడైన మైఖెల్ డయ్యర్‌ను ఉద్దమ్ సింగ్ లండన్‌లో కాల్చిచంపాడు.
- 1963: అర్జున అవార్డును ప్రారంభించారు.
- 1980: భారతీయ జనతా పార్టీ యువనేత వరుణ్ గాంధీ జననం.



జోసెఫ్ ప్రీస్ట్లీ



కోలాచలం శ్రీనివాసరావు



బూర్గుల రామకృష్ణారావు




శ్రీనివాస చక్రవర్తి



వల్లంపాటి వెంకటసుబ్బయ్య



ఉద్దమ్ సింగ్



అర్జున అవార్డు



వరుణ్ గాంధీ

రిపబ్లిక్ స్పోర్ట్స్

# రోహిత్ టార్గెట్ అదేనా? అప్పటివరకు 'నో రిటైర్మెంట్'!

వరుసగా రెండు ఐసీసీ ట్రోఫీలను గెలిపించిన సారథి రోహిత్. ఇంకా రిటైర్మెంట్ గురించి ఆలోచించలేదని చెప్పిన రోహిత్.. ఎప్పటివరకు కొనసాగుతాడనేది ఆసక్తికరంగా మారింది.




టీ20 ప్రపంచ కప్ గెలిచాడు. ఛాంపియన్స్ ట్రోఫీని అందించాడు. ఇప్పటికే పొట్టి ఫార్మాట్కు వీడ్కోలు చెప్పేశాడు. ఇప్పుడు వన్డేలకూ గుడ్బై చెబుతాడని అంతా భావించారు. కానీ, రిటైర్మెంట్ తీసుకోవడం లేదంటూ స్పష్టంచేసేశాడు. ఆ ఆటగాడు ఎవరనేది ఇప్పటికే అర్థమైపోయిందిగా. అతడే.. భారత కెప్టెన్ రోహిత్ శర్మ. ఈ క్రమంలో వన్డే ప్రపంచకప్ 2027 వరకూ ఉంటాడని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఐసీసీ టెస్టు ఛాంపియన్ షిప్ (2025-27) ఫైనల్లోనూ ఆడాలనేది అతడి అభిమతంగా ఉందనేది వారి అంచనా. "రోహిత్ అనుకున్నవిధంగా భావిస్తే మాత్రం అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ మరో రెండేళ్లపాటు కొనసాగే అవకాశం ఉంది. దక్షిణాఫ్రికా-జింబాబ్వే-నమీబియా ఆతిథ్యంలో వన్డే ప్రపంచ కప్ 2027 టోర్నీ జరగనుంది. ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్ కూడా అదే ఏడాది ఉంది. ఈ రెండింటిని గెలిచి ఘనంగా కెరీర్కు వీడ్కోలు పలకాలనేది రోహిత్ భావన" అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

### ఐపీఎల్ తర్వాతే ఓ నిర్ణయం..

రోహిత్ శర్మ మరో నెల రోజుల్లో 38వ సంవత్సరంలోకి అడుగుపెట్టనున్నాడు. 2027 నాటికి అతడికి 40 ఏళ్లు వస్తాయి. అప్పటివరకు కొనసాగాలంటే ఫిట్నెస్తోపాటు బ్యాటింగ్లో ఫామ్ అత్యంత కీలకం. టీమ్ ఇండియా అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్తో కలిసి రోహిత్ పనిచేయనున్నట్లు తెలుస్తోంది. రాబోయే రెండేళ్లలో భారత్ 27 వన్డేలు ఆడే అవకాశం ఉంది. దినేశ్ కార్తిక్ నుంచి కేఎల్ రాహుల్ వరకు నాయర్ కోచింగ్ పై మంచి గురి ఉంది. రోహిత్తో కలిసి ఆడిన అనుభవం ఉంది. అయితే, టెస్టు భవిష్యత్తుపై మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. గత బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో రోహిత్ ప్రదర్శన గొప్పగా ఏమీ లేదు. దీంతో ఐపీఎల్ ముగిసిన తర్వాత టెస్టు కెరీర్పై రోహిత్ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ఇంగ్లాండ్ తో జూన్లో టెస్టు సిరీస్ జరగనుంది. అప్పుడు ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ నాలుగో సీజన్ మొదలవుతుంది. డబ్ల్యూటీసీ ఫైనల్కు చేరుకోవాలంటే భారత్కు ఈ సిరీస్ అత్యంత కీలకం.

## ఇంటి చిట్కాలు

# చింతపండుతో జుట్టు రాలడం నుంచి తెల్ల జుట్టు వరకు అన్నీ

## హెయిర్ ప్రాబ్లమ్స్ మాయం, అయితే, ఎలా వాడాలో తెలుసా?

ఎటువంటి ఖర్చు లేకుండా.. కొన్ని సహజ పద్ధతుల ద్వారా జుట్టును సంరక్షించుకోవచ్చు. కొన్ని ఇంటి చిట్కాలు జుట్టు సమస్యల్ని తగ్గిస్తాయి. జుట్టు రాలడం, పొడిబారడం, తెల్ల జుట్టు వంటి అన్నీ హెయిర్ ప్రాబ్లమ్స్‌కి చింతపండు బాగా ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు.

ఈ రోజుల్లో బిజీ లైఫ్‌స్టైల్, దుమ్ము, కాలుష్యం కారణంగా మన జుట్టు పొడిగా, నిర్జీవంగా మారుతుంది. అంతేకాకుండా.. తెల్ల జుట్టు, తలపై వెంట్రుకలు రాలిపోవడం, పొడి జుట్టు వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. చిన్న వయసులోనే చాలా మంది జుట్టు సమస్యలతో సతమతమవుతున్నారు. దీంతో జుట్టు సమస్యలకు చెక్ పెట్టడానికి చాలా మంది ఖరీదైన షాంపూలు, కండిషనర్లు సీరమ్‌లు వాడుతున్నారు. అయినా సరైన ఫలితాలు ఉండటం లేదు. అయితే, ఎటువంటి ఖర్చు లేకుండా.. కొన్ని సహజ పద్ధతుల ద్వారా జుట్టును సంరక్షించుకోవచ్చు. కొన్ని ఇంటి చిట్కాలు జుట్టు సమస్యల్ని తగ్గిస్తాయి. జుట్టు రాలడం, పొడిబారడం, తెల్ల జుట్టు వంటి అన్నీ హెయిర్ ప్రాబ్లమ్స్‌కి చింతపండు బాగా ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు. అవును మీరు విన్నది నిజమే.. వంటల్లో ఉపయోగించే చింతపండుతో జుట్టు సమస్యలకు చెక్ పెట్టవచ్చు. చింతపండుతో ప్రయోజనాలేంటి, జుట్టు సమస్యలకు చెక్ పెట్టడానికి దాన్ని ఎలా వాడాలో ఇక్కడ తెలుసుకుందాం.

### చింతపండులో పోషకాలు



చింతపండులో జుట్టు ఆరోగ్యానికి మేలు చేసే విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, జింక్, ఐరన్ మూలాలు ఉంటాయి. ఇవి జుట్టుకు తగిన పోషణనిస్తాయి. జుట్టును ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా ఎన్నో ప్రయోజనాల్ని అందిస్తుంది. చింతపండుతో కలిగే ప్రయోజనాలేంటి, దాన్ని ఎలా వాడాలో ఇప్పుడు తెలుసుకుందాం.



### చుండ్రుకు చెక్




చింతపండులో ఉండే విటమిన్ సి తల చర్మాన్ని శుభ్రపరుస్తూ చుండ్రును తొలగించడంలో సహాయపడుతుంది. ఇందుకోసం కొంచెం చింతపండును నీటిలో నానబెట్టి రాత్రంతా అలాగే ఉంచండి. ఉదయం చింతపండును బాగా నలిపి, నీటిని ఫిల్టర్ చేయండి. ఆ నీటిని జుట్టు, తలపై రాయండి. అరగంట తర్వాత, జుట్టును శుభ్రమైన నీటితో వాష్ చేసుకోండి. ఈ రెమెడీని కొన్ని రోజులు పాటు ఫాలో అయితే చుండ్రు సమస్య తగ్గుతుందని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

### మృదువైన జుట్టు




జుట్టును మృదువుగా చేయడానికి, చింతపండు నీటిని ఉపయోగించవచ్చు. ఇందుకోసం ఒక గిన్నెలో చింతపండు నీళ్ళు తీసుకోండి. అందులో అలోవెరా జెల్ కలిపి జుట్టుకు అప్లై చేయాలి. ఈ హెయిర్ మాస్క్ ఆరిన తర్వాత, మీ జుట్టును షాంపూతో కడగాలి. ఈ హెయిర్ మాస్క్ జుట్టును హైడ్రేటెడ్‌గా ఉంటుంది. జుట్టుకు కావాల్సిన తేమను అందిస్తుంది. దీంతో జుట్టు మృదువుగా మారడంతో పాటు మెరుస్తుంది.

### జుట్టు పెరుగుదల



చింతపండు నీరు జుట్టు పెరుగుదలకు కూడా ప్రభావవంతంగా ఉంటుంది. చింతపండు నీరు జుట్టు పెరుగుదలను ప్రోత్సాహిస్తుంది. ఇందుకోసం చింతపండు నీటితో జుట్టును క్రమం తప్పకుండా మసాజ్ చేయాలి. మసాజ్ చేయడం వల్ల తలలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీనివల్ల జుట్టు వేగంగా పెరగడం ప్రారంభమవుతుంది.

### జుట్టు రాలడం ఆగిపోతుంది



ఈ రోజుల్లో చాలా మందిని వేధిస్తున్న సమస్య జుట్టు రాలడం. జుట్టు రాలడంతో బాధపడుతుంటే చింతపండు నీరు మీకు బెస్ట్ ఆప్షన్ అంటున్నారు నిపుణులు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, జింక్, ఐరన్ జుట్టును బలంగా మారుస్తాయి. దీంతో జుట్టు రాలడం తగ్గిపోతుంది. ఇందుకోసం కొంచెం చింతపండును నీటిలో నానబెట్టి రాత్రంతా అలాగే ఉంచండి. ఉదయం చింతపండును బాగా నలిపి, నీటిని ఫిల్టర్ చేయండి. ఆ నీటిని జుట్టు, తలపై రాయండి. అరగంట తర్వాత, జుట్టును శుభ్రమైన నీటితో వాష్ చేసుకోండి.

**జుట్టు చివర్లు చిట్లిపోవడం ఆగిపోతుంది**

జుట్టు పొడిబారడం వల్ల తరచుగా చివర్లు చిట్లడం జరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో చింతపండు నీరు జుట్టుకు తేమను అందిస్తుంది. అంతేకాకుండా చివర్ల చిట్లిపోవడాన్ని నియంత్రిస్తుంది. ఇందుకోసం చింతపండు నీళ్ళను హెన్నా లేదా కలబంద జెల్ తో కలిపి జుట్టుకు అప్లై చేయాలి. ఆ తర్వాత ఇరవై నిమిషాల పాటు ఆరనివ్వాలి. బాగా ఆరిన తర్వాత జుట్టును వాష్ చేసుకోవాలి. ఇది జుట్టులో తేమను నిలుపుతుంది. దీంతో, జుట్టు పొడిబారడం ఆగిపోతుంది

### తెల్ల జుట్టు

ఈ రోజుల్లో చాలా మంది తెల్ల జుట్టుతో బాధపడుతున్నారు. చిన్న వయసులోనే జుట్టు నెరసిపోతుంది. ఇలాంటి వారికి చింతపండు బెస్ట్ ఆప్షన్. ఇందుకోసం చింతపండు నీరును తీసుకోండి. ఆ తర్వాత ఈ నీటిని హెన్నాతో కలపండి. ఆ తర్వాత జుట్టుకు బాగా అప్లై చేసి.. కాసేపు ఆరనివ్వండి. జుట్టు బాగా ఆరిన తర్వాత తేలికపాటి షాంపూతో వాష్ చేసుకోండి. ఇలా చేయడం వల్ల జుట్టు నల్లగా మారుతుందని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. **గమనిక** ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.